# ఆడతనం

(స్వాతి సపరివార పత్రిక 12-12-97)

"ఏమండీ. ఈ ఒక్కసారికి నా మాట కాదనకండి ప్లీజ్" లాలనగా అంది లత.

"అది కాదోయ్ నాకు అనీజీగా వుంటుంది అర్థం చేసుకో...." అనునయంగా అన్నాడు శశిధర్.

"అబ్బ....అందుకే ఎంతగా చెప్పినా మళ్ళీ మొదటికే వస్తారే" బుంగమూతి పెట్టింది స్వర్ణలత.

భార్య బతిమిలాట ధోరణికి సగం మెత్తబడ్డాడు శశిధర్.

భార్య బతిమిలాట ధోరణికి సగం మెత్తబడ్డాడు శశిధర్.

"అంత కష్టంగా వుంటే వద్దులేండి .. మీ ఇష్టం" నిష్ఠూరంగా అంది.

"నో నో నో. దేవి గారి ఇష్టం నాకు ఎప్పటికీ కష్టం కాదు. ఓకే అలాగే . నీ ఇష్టప్రకారమే ఒప్పుకుంటున్నాను. రేపు వచ్చే శుక్రవారం కదా అన్నావు" అన్నాడు భార్య ముఖంలో ఆనందపు వెలుగుల్ని వెతుకుతూ.

"యా మై డియర్" అంటూ అతని పెదాలపై ముద్దుపెట్టుకుంది లత. ఊహించని ఆమె చర్యకు ఉబ్బితబ్బిబ్బయ్యాడు శశిధర్.

★ ★ ★

"నీ అంత అందాలరాశి నా భార్య కావటం నా అదృష్టం అనుకుంటున్నా" అన్న శశిధర్ తొలిరేయి తొలిపలుకు ఇప్పటికీ పులకింత కలిగిస్తుంది లతకి.

తన అందానికి అంతగా విశేషమైన శ్రద్ధ చూపే ఆమెకు పంచప్రాణాలు. కాపురానికి వచ్చిన రోజునుంచీ ఈనాటి వరకూ భర్తకు అందంగా కనిపించటానికే ప్రయత్నించింది స్వర్ణలత

వయసు పైబడ్డా వార్ధక్యం దగ్గర పడుతున్నా అందుకు తగినట్లుగా ముస్తాబయ్యే స్వర్ణలత చతురతకు ముచ్చట పడుతుంటాడు శశిధర్ రేపోమాపో అమ్మమ్మ, తాతయ్యలు కాబోతున్న వారు ఇప్పటికీ నిత్యనూతనంగా, ఉల్లాసంగా వుంటారు.

పెళ్ళిళ్ళకు వెళ్ళినప్పుడో, పేరంటాల్లో చూడటం తటస్థ పడినప్పుడో నిండుగా కప్పుకున్న పైటతో, పెద్దమనిషి తరహాగా, హుందాగా కనిపించే లతని చూసి అచ్చెరువొందుతాడు శశిధర్.

"రాత్రిళ్లు గదిలోకి వచ్చేటప్పుడు రకరకాల బ్రాలతో పల్చటి నైటీలతో కనిపించి, తనని కవ్వించి, నవ్వించి, మైమరపించి, మధురానందాన్ని ఇచ్చే స్వర్ణేనా ఈమె" అనుకుంటాడు.

"అవునుమరి పదిమందిలో వున్నప్పుడు పద్ధతిప్రకారం మసలుకుని, ఏకాంతంలో మగడి సన్నిధిలో మాత్రమే అందాల్ని బహిర్గతం చేస్తూ, భర్తని మైమరపించటమే కదా శయనేషు రంభ గా ప్రవర్తించటం" అని భార్యను మనసులోనే పొగుడ్తూ, సమయం చూసి తన మనోభావాల్ని భార్యకు వినిపిస్తుంటాడు.

తనపైన, తన సౌందర్యంపైన భర్తకున్న అభిమానం వీసమెత్తు కూడా తగ్గకుండా జాగ్రత్త పడాలని ఆరాటపడుతూ, అందుకోసం రకరకాలుగా ముస్తాబులు చేసుకుంటుంది స్వర్ణలత.

భార్య అలా అలంకరించుకుని తనని అలరింప చేయటం సంతోషంగానే వున్నది కానీ ఇప్పుడు తనని కూడా తలకి రంగు వేసుకోమని పోరుపెట్టటం ఇబ్బందిగా అనిపించింది. ఏమైనా ఆమె కోరికను తల ఒగ్గక తప్పలేదు.

అందుకే రాబోయే శుక్రవారం తమ పెళ్ళిరోజు నాటికి తలకి రంగు వేయించుకునేందుకు అంగీకరించాడు.

తన కోరికను తీర్చేందుకు అంగీకరించిన భర్తకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొని ఉబ్బి తబ్బిబ్బయిపోయింది. అతడి కొత్త రూపాన్ని మనసులో ఊహించుకుని మురిసిపోసాగింది.

★ ★ ★

తలకి రంగు వేయించుకున్న శశిధర్ తెగ సిగ్గుపడిపోసాగాడు సాయంత్రం భార్యతో కలిసి సినిమాకి. అట్నుంచి అటే హొటల్లో భోజనం చేసి ఇంటికి రావాల్సిన కార్యక్రమం వున్నది. ప్రతి పెళ్ళి రోజున వారి అలవాటది.

దారిలో స్నేహితులో, సహోద్యోగులో కనిపిస్తారని బిడియంగా, సిగ్గుగా బయల్దేరాడు శశిధర్. ఎప్పటిలా నాజూగ్గా తయారైంది స్వర్ణలత

రిక్షాలో వెళ్తున్నప్పుడూ, భార్య పక్కన నడుస్తున్నప్పుడూ ఏమిటో గిల్టీగా ఫీలవుతున్నాడు శశిధర్.

సినిమా మంచి శృంగారభరితంగా వున్న కారణంగా కాసేపు తల విషయం విస్మరించి, ఉత్తేజం పొందాడు. ఉత్సాహంగా భార్యతో పరాచికాలాడాడు సినిమా హాల్‌లో. హొటల్లో కూడా యెరిగిన వారు ఎదురుపడక పోవటంతో కాస్తంత ఊరట చెందాడు. పదకొండు గంటలు కావస్తుండగా ఇల్లు చేరారు ఆలుమగలు.

తల నిండా పూలతో, పల్చటి నైటీలో కొత్త అందాలు సంతరించుకున్న స్వర్ణలత పడకగదిలోకి ప్రవేశించింది.

ఆమె రాకకోసం ఎదురుచూస్తున్న శశిధర్ ఒక్కసారిగాఆమెను బిగియారా కౌగిలించుకున్నాడు.

ఎందుకనో ఎప్పటిలా ఉత్సాహం చూపని స్వర్ణలత వంక

అనుమానంగా చూశాడు. బలవంతంగా నవ్వు తెచ్చి పెట్టుకున్న భార్యను పొదివి పట్టుకుని "అలా వున్నావేం?" అనడిగాడు లాలనగా.

"ఏం లేదండీ....మామూలుగానే వున్నాను" చెప్పిందామె. ఆమె సమాధానం అతన్ని తృప్తి పరచలేదు.

ఆమెని ఉత్తేజపరచటానికి చేతుల్తో ఎక్కడెక్కడో స్పృశించాడు.

మాటలతో మదనతాపం పెంచాలని ప్రయత్నించాడు ఐనా ఆమె ఎప్పటిలా ప్రతిస్పందించలేదు. ఉత్సాహం చూపలేదు. శశిధర్‌కి శరీరంతోపాటు మనసుకూడా వేడెక్కింది.

"నువ్వేదో దాస్తున్నావ్ .. నిజం చెప్పు" అంటూ భార్య కళ్ళలోకి చూశాడు

"నిజం చెప్పనా" బేలగా అన్నది లత. చెప్పమన్నట్లు తలాడించాడు.

"మీరు మీరు....మీరుగా అనిపించటం లేదు. కొత్తగా వున్నారు. ఎవరో అనిపిస్తున్నారు. అందుకే అందుకే ఇదివరకులా అనుకోలేక పోతున్నాను" మనసులో మాట బయటపెట్టింది.

తలకి రంగు బాధ తప్పిందన్న సంతోషం కంటే శ్రీమతి ఆగిపోనందుకు ఆనందపడ్డాడు శశిధర్.

అంతే కాదు.

"పరాయి పైట తొలగినా, తగిలినా, తన్మయం చెంది, రెట్టింపు ఉత్సాహంతో, ఉద్విగ్నత పొందే మగవాడు, మగతనం అనుకునే దానికంటె ఠరే అని తెలిసినా రూపం కొత్తగా కనిపించినంత మాత్రానే మానసికంగా విముఖత్వానికి లోనయిన ఆడతనం ఎన్నిరెట్లు నైతికంగా బలమైందో కదా!" అనుకోకుండా వుండలేకపోయాడు శశిధర్.

— X —